క్లుప్తంగా

పోలేరమ్మకు పొంగళ్లు

చేజర్ల: బోడిపాడులో గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు పొంగళ్ల సామగ్రి బుట్టలను నెత్తిన పెట్టుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయిళ్ల మాలకొండారెడ్డి, ఉపసర్పంచ్ పాలకొండ వెంకటరత్నారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆదివారం నగదు సాయం అందజేశారు. 5వ వార్డుకు చెందిన షేక్ బీబీజాన్, 6వ వార్డుకు చెందిన షేక్ సయ్యద్‌షమీ, 12వ వార్డుకు చెందిన పేమల రమేష్, అదే వార్డుకు చెందిన మొద్దు పెంచలమ్మ, 17వ వార్డుకు చెందిన సయ్యద్ ముస్తఫా ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులకు రూ.10వేలు చొప్పున అందజేశారు. సోమవరపు యానాది రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వల్లభనేనికి సత్కారం



ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన వల్లభనేని రాజేంద్రను ఆయన స్వగ్రామమైన కరటంపాడులో నాయకులు, కార్యకర్తలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

వైభవంగా గంధ మహోత్సవం



సంగం: దువ్వూరులోని ఆస్తానా ఏ నూరియాలో హజరత్ షేక్ షానూరిసాహెబ్ ఆధ్వర్యంలో హజరత్‌ఖాజా గరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిస్తీ హసన్ సంజరీ రహమతుల్లా అల్లై అజ్మీరి గంధ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత మేళతాళాల నడుమ గంధాన్ని ఊరేగింపుగా ఆస్థాన ఏ నూరియాకు చేర్చారు. అనంతరం ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు.

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

వరికుంటపాడు: స్థానిక పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ అమ్మాజీ దంపతులు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు.

మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీగా హబీబ్‌బాషా

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటకు చెందిన హబీబ్‌బాషా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ శాలీ దాదా నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన ఆదివారం తెలిపారు.

ఎల్లమ్మకు విశేష పూజలు

వరికుంటపాడు: మండలంలోని తోటల చెరువుపల్లెలో కొలువైన సంధ్యాల ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యహావాచనం, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు.

వివేకానందుని బోధనలు యువతకు స్ఫూర్తిదాయకం



వింజమూరులోని ఉన్నత పాఠశాలలో వివేకానందునికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉదయగిరిలోని బీజేపీ కార్యాలయంలో...



వరికుంటపాడు మండలం గువ్వాడిలో..



కలిగిరిలో నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రావు

కలిగిరి: స్వామి వివేకానందుని బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని విశ్రాంత ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నందనవనం ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. కలిగిరిలోని వివేకానందనగర్‌లో ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ఆవరణంలోని వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. సర్వధర్మ సమ్మేళనంలో హిందూ ధర్మం గురించి ఎంతో గొప్పగా వివరించి ఎంతోమంది విదేశీయులను హిందూ ధర్మం వైపు నడిపించిన మహనీయుడు వివేకానందుడని కొనియాడారు. వ్యక్తి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలడని, మానవసేవయే మాధవసేవగా భావించి సమాజంపై ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు కందల మధు, పీ వెంగయ్య, డేగా మధు, వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

• ఉదయగిరిలోని బీజేపీ కార్యాలయంలో వివేకానందుని చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఆవుల రోశయ్య, చల్లా సుబ్బరత్నం, మస్తాన్, దుగ్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడి రామాలయం వద్ద వివేకానందుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి యువత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు సుధాకర్, యువత ప్రభాకర్‌రావు, వంశీ, కేశవ, చెన్నారాయుడు, కిరణ్, లోకేశ్, రవీంద్ర ,సతీష్ పాల్గొన్నారు

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై శివకృష్ణారెడ్డి



సోమశిల: క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి హాజరైన ఐఎఫ్‌ఎస్ బుడుగు శ్రీనివాసులరెడ్డి



ఆత్మకూరులో ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సోమశిల: సంక్రాంతిని పురస్కరించుకుని అనంతసాగరం మండలం పడమటికంభంపాడులోని ధర్మపల్లెమ్మ ఆలయ ప్రాంగణంలో హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ జీఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఐఎఫ్‌ఎస్ బుడిగ శ్రీనివాసులరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల పోటీ తత్వం అలవడుతుందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ రీజనల్ మేనేజర్ ఏటూరు ప్రసాద్, విశ్రాంత ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు రొండ్ల వెంకటరమణారెడ్డి, కార్యదర్శి కత్తి పెంచలయ్య, ట్రెజరర్ రొండా శ్రీనివాసులరెడ్డి, ఆర్గనైజర్ బొమ్మిళ్ల మురళి, వై సుధాకర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడా పోటీలను ఆదివారం ప్రారంభించారు. డీవైఎఫ్‌ఐ నాయకులు సీపీఎం నాయకులతో కలిసి పోటీలను ప్రారంభించారు. సీతారామ్ ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేసి నాలుగు రోజుల పాటు వాలీబాల్, క్రికెట్, షటిల్, ఫుట్‌బాల్, తదితర పోటీలతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలుత డీవైఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించారు. డీవైఎఫ్‌ఐ నిర్వాహకులు రిచర్డ్, నందా శ్రీను, ఫయాజ్, మహేష్, రాహుల్, ఏ హజరత్తయ్య, సీఐటీయూ నాయకులు జీ శివప్రసాద్, యూటీఎఫ్ నాయులు హరికృష్ణ, సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, షేక్ సందానీ, కౌలు రైతు సంఘం నాయకులు లక్ష్మీపతి, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఎస్సై శివకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. యువత క్రీడల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. విజేత జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టుకు రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు బసినేనిపల్లి, పోలంగారిపల్లి జట్లు తలపడగా బసినేనిపల్లి జట్టు విజయం సాధించింది.

నార్త్‌కొండాయపాళెం సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

వరికుంటపాడు: మండలంలోని నార్త్‌కొండాయపాళెం సర్పంచ్ కాశే రమణమ్మ చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. 2018లో తాను నిర్మించిన సీసీరోడ్లకు సంబంధించిన బిల్లుల నగదును సర్పంచ్ చెల్లించలేదని, ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పంచాయతీకి చెందిన ముజ్జే లక్ష్మీనారాయణ గతంలో జిల్లా ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు అందజేసిన నివేదిక ఆధారంగా సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ గత నెలలో జిల్లా పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తగిన ఆధారాలను ఇవ్వాలని సర్పంచ్‌ను కోరారు. ఈ మేరకు సర్పంచ్ తన వద్ద ఉన్న బిల్లుల చెల్లింపుల ఆధారాలను ఉన్నతాధికారులకు సమర్పించింది. వాటిని పరిశీలించి విచారణ జరిపిన అధికారుల నివేదిక ఆధారంగా సర్పంచ్ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని గుర్తించిన డీపీఓ చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

సంక్రాంతి శుభాకాంక్షలు



మేకపాటి విక్రమ్‌రెడ్డి



రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: సంక్రాంతిని పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రతిఒక్కరి జీవితాల్లో సంక్రాంతి వెలుగులు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కాంక్షించారు.

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, ప్రతిఇంటా భోగభాగ్యాలు కలగాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వింజమూరు(ఉదయగిరి): ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు ఈ నెల 16వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వింజమూరు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ కార్పొరేషన్ 30, ఈబీసీ కార్పొరేషన్ 2, కమ్మ కార్పొరేషన్ 2, రెడ్డి కార్పొరేషన్ 3, ఆర్యవైశ్య కార్పొరేషన్ 1, బ్రాహ్మణ కార్పొరేషన్ 1, కాపు కార్పొరేషన్ 4 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం



ఎం వీరరఘు (బోగోలు)



కే శివకుమార్‌రెడ్డి (కావలి పట్టణం)



వీ తిరుపతి (కావలి మండలం)



ప్రసాద్ నాయుడు (దగదర్తి)



తిరుపతినాయుడు (వరికుంటపాడు)

కావలి/బిట్రగుంట: వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లుగా పలువురు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కావలి పట్టణ కన్వీనర్‌గా కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కావలి మండల కన్వీనర్‌గా వాయిల తిరుపతి, దగదర్తి మండల కన్వీనర్‌గా తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, బోగోలు మండల కన్వీనర్‌గా మద్దిబోయిన వీరరఘు, అల్లూరు నగర పంచాయతీ కన్వీనర్‌గా దండా కృష్ణారెడ్డి, అల్లూరు మండల కన్వీనర్‌గా బీద రమేష్‌ను నియమితులయ్యారు. కాగా బోగోలు మండలానికి చెందిన మద్దిబోయిన వీరరఘుయాదవ్ పార్టీ ఆవిర్భావం నుంచి మద్దిబోయిన వీరరఘు క్రియాశీలక కార్యకర్తగా, మండల కన్వీనర్‌గా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థుల తిరుగులేని విజయాలకు కృషి చేశారు. ఇప్పటికి రెండుసార్లు అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రలోభాలకు లొంగకుండా పార్టీ అభివృద్ధికే కృషి చేయడంతో మూడోసారి కూడా రఘునే మండల కన్వీనర్‌గా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తరువ్వ జారీ చేసింది. దీంతో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో రఘుని కలిసి అభినందనలు తెలియజేశారు.



జితేంద్రనాగ్‌రెడ్డి (ఆత్మకూరు మండలం)

వరికుంటపాడు: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా మందలపు తిరుపతినాయుడును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. మండలంలోని కాంచెరువుకు చెందిన ఆయన గతంలోనూ వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా పనిచేసి ఉన్నారు. ఆయన నియామకంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు మండలాధ్యక్షుడిగా చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో మండలాధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయననే మళ్లీ నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జితేంద్రనాగ్‌రెడ్డి నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

సీతారామపురం: స్థానిక పడమటి వీధిలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా మహిళలకు మండల స్థాయి ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు రామిశెట్టి తిరుపతయ్య, ఆకుల శ్రీనివాసులు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు రంగవల్లులు ప్రతీకలని తెలిపారు. అందుకే ఏటా సంక్రాంతి సందర్భంగా రంగవల్లుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సుష్మ ప్రథమ బహుమతి రూ.5 వేలు, అపర్ణకుమారి ద్వితీయ బహుమతి రూ.3 వేలు, నందిని తృతీయ బహుమతి రూ.2 వేలును గెలుచుకున్నారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు చీరలు అందజేశారు.

అపూర్వ సమ్మేళనం



గురువులను సన్మానించిన పూర్వవిద్యార్థులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు 25 ఏళ్ల తరువాత ఒకరినొకరు కలుసుకున్నారు. 2000లో పదోతరగతి చదివిన విద్యార్థులు నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సమావేశమై గత స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేసి గురు భక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గండిపాళెంలో చదువుకున్న విద్యార్థులందరూ ప్రస్తుతం డాక్టర్లు, ఇంజనీర్లుగా, ఉపాధ్యాయులుగా ఉన్నత స్థాయిలో స్థిరపడడం సంతోషకరమన్నారు. వారంతా తమను గుర్తుపెట్టుకుని ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించి సన్మానించడం జీవితంలో మర్చిపోలేమన్నారు. పూర్వ విద్యార్థులందరూ గండిపాళెం పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తూ ఉండడం అభినందనీయమని కొనియాడారు. దాదాపు 150 మంది పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి హాజరయ్యారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ఆందోళన



ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లిలో ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యానికి కనీస మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు 75 కేజీల బస్తాను కేవలం రూ.1,400కే కొనుగోలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



కోడిపందేల స్థావరాలపై దాడులు


కలిగిరి: మండలంలోని తూర్పుగుడ్లదొన శివారు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై ఉమాశంకర్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 కోళ్లు, రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తుంటే 94407 00098 నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం తక్కెళ్లపాడు అటవీ ప్రాంతంలో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై వీరప్రతాప్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఐదు కోళ్లు, రూ.26 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

సంగం: మండలంలోని కావలి కాలువ సమీపంలోని ప్రభుత్వ కాలనీల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై రాజేష్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1180నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ

ఆత్మకూరు: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ సూచించారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలతో కలిసి రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకుంటే రౌడీషీట్లను తొలగిస్తామని తెలిపారు. అనంతరం సీఐలు, ఎస్సైలతో నేరాలు, శాంతిభద్రతలపై సమీక్షించారు. సర్కిల్ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పట్టణంలో బందోబస్తు, ట్రాఫిక్ విషయంలో పోలీసులు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. ఆత్మకూరు, సంగం సీఐలు జి గంగాధర్, వేమారెడ్డి, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిప్రసాద్, సైదులు, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

